క్లుప్తంగా

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్

పాలసముద్రం : గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారి ప్రవీణ్ సూచించారు. శనివారం పీహెచ్‌సీలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని స్పష్టం చేశారు. బాలింతలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. సమావేశంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరచుదాం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వడమాలపేట(విజయపురం): విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరుచుకుందామని ఎంపీడీఓ శేషగిరి రావు అన్నారు. శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఎస్వీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు.

ప్రొఫెసర్‌పై దాడికి నిరసన



దళిత నాయకుల నిరసన

నింద్ర: తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి చేయడం దారుణమని దళిత నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ దళితులపై దాడులు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మైఖేల్, ఇమ్మానుయేల్, గోపి, వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభారాం, సంపత్, గిరి, మాదిగ మహాసేన జిల్లా కార్యదర్శి మురళి, నాయకులు గోవిందరాజులు, కాటయ్య, చార్లీ, ప్రేమ్‌కుమార్, మణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటల పోటీలు



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం : మండలంలోని ఆముదాల ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహిళలకు శనివారం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. రూరల్ యాక్షన్ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ సెక్రటరీ చిట్టిబాబు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కోరారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పురుషులకు దీటుగా స్త్రీలు సత్తా చాటుతున్నారని వెల్లడించారు. అనంతరం రంగోలి, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్ సురేష్ బాబు, మురుగన్ ల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

నింద్ర: తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయుల కృషితోనే పిల్లలు విద్యావంతులవుతారని ఎంఈఓ శ్రీధర్‌రాజు అన్నారు. మండలంలోని పాఠశాలల్లో పేరెంట్స్ మీట్ నిర్వహించారు. కనికాపురం ఎస్టీకాలనీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిల్లలు ఇంటి దగ్గరకూడా బోధన అంశాలపై చదువుకునేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. క్రీడల్లో కూడా విద్యార్థి దశ నుండే ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, విద్యాకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే సమావేశాలు

పుత్తూరు: విద్యార్థుల భవిష్యత్ కోసమే తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పుత్తూరు మండల స్పెషల్ ఆఫీసర్ సూర్యానారాయణ తెలిపారు. శనివారం మండల పరిధిలోని గోపాలకృష్ణాపురం ఉన్నత పాఠశాలలో మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమావేశాల ద్వారా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య మంచి వాతావరణం ఏర్పడుతుందన్నారు. అనంతరం తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసంపూర్తి అంగన్‌వాడీలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులతో విశేష కృషి చేసింది. నాడు–నేడు పేరిట పాఠశాలల రూపురేఖలు మార్చారు. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. సొంత భవన నిర్మాణాలను చేపట్టారు. వాటిలో చాలా వరకు పూర్తి కాగా కొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండా అలా గాలికి వదిలేసింది.

- గత ప్రభుత్వంలో ప్రారంభమైన భవన నిర్మాణాలు
- నాడు–నేడు కింద మొదలైన పనులు
- కూటమి ప్రభుత్వం రావడంతో ఆగిన పనులు



అమరంకండ్రిగ వద్ద ఆగిన భవన నిర్మాణ పనులు

పుత్తూరు: గత ప్రభుత్వంలో జరుగుతూ వచ్చిన అన్ని అభివృద్ధి పనులు ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఎక్కడికక్కడ ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఏ అభివృద్ధి పనుల్లోనూ ఒక్క ఇటుక పడిన పాపాన పోలేదు. గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలో చాలా వరకు నూతన అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. పుత్తూరు ఐసీడీఎస్ పరిధిలోని పుత్తూరు రూరల్‌లో 43, అర్బన్‌లో 43, వడమాలపేటలో 43, మొత్తం 129 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో గర్భిణులు 642, బాలింతలు 644, మూడేళ్లలోపు పిల్లలు 3,969, మూడు నుంచి ఆరేళ్ల పిల్లలు 1,537 మంది ఉన్నారు. అయితే 129 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కేవలం 62కు మాత్రమే ఉన్నాయి. అద్దె లేకుండా వివిధ పాఠశాలల్లో 41 కేంద్రాలు నడుస్తుండగా, 26 భవనాలకు అద్దె చెల్లిస్తున్నారు. గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన 11 అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలు ప్రస్తుతం ఆగిపోయాయి. ఆగిన వాటిలో పుత్తూరు పట్టణ



చౌటూరులో ఆగిన భవన నిర్మాణం

పరిధిలోని అమరంకండ్రిగ, చెర్లోపల్లి హరిజనవాడ, చినరాజుకుప్పం హరిజనవాడ, వినాయకపురం, కుందిమాకులగుంట ఇర్లిండ్లు, చౌటూరు, తాయిమాంబాపురం, రూరల్ మండల పరిధిలోని తడుకు కొత్తఇర్లాపురం, తిరుమలకుప్పం ఎస్టీకాలనీ, వడమాలపేట మండలంలో టీబీఆర్ కండ్రిగ, వడమాల వడ్డిపల్లి గ్రామాల్లో భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి. తమ పిల్లల కోసం చేపట్టిన భవన నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, పూర్తి చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



చెర్లోపల్లి హెచ్‌డబ్ల్యూలో అసంపూర్తి భవనం

పక్కదారి పడుతున్న పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు గర్భిణులకు అందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు ఇటీవల కాలంలో వినిపిస్తున్నాయి. సీడీపీఓ పద్మజ గత రెండు నెలలుగా సెలవులో ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రాలు గాడితప్పినట్లు తెలుస్తోంది. ఇన్‌చార్జి సీడీపీఓగా సూపర్‌వైజర్ సంధ్య వ్యవహరిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ వర్కర్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అందరికీ అందుబాటులో ఉండాలి



పిల్లల భద్రత నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను అందరికీ అందుబాటులో ఏర్పాటు చేయాలి. చాలా వరకు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సొంతంగా భవనాలు నిర్మించాలి. మా గ్రామంలో ఆగిన భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి.

– వి.కస్తూరి, చౌటూరు గ్రామం

వెంటనే పనులు పూర్తి చేయాలి



పిల్లల కోసం నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు అర్ధంతరంగా ఆగిపోవడం విచారకరం. పిల్లలను దూర ప్రాంతాలకు పంపలేం. అందరికీ అందుబాటులో ఉండేలా ప్రతి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం వెంటనే ఆగిన పనులను తిరిగి ప్రారంభించాలి.

– కె.గీత, తడుకు హరిజనవాడ

వాడి వేడిగా మండల మీట్

గంగాధర నెల్లూరు : జీడీ నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. ఎంపీపీ అనిత అధ్యక్షత వహించి సభలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. వెజ్జుపల్లె సర్పంచ్ హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తమ పంచాయతీలో విద్యుత్ తీగల సమస్యను పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదని ఆరోపించారు. తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. పాఠశాలలో మరొక టీచర్‌ను నియమించాలని సూచించారు. కలిజవేడు సర్పంచ్ మాట్లాడుతూ పశువులకు అవసరమైన మందులను వెటర్నరీ అసిస్టెంట్లు అందించడం లేదని ఫిర్యాదు చేశారు. గోకులం షెడ్లను కేవలం 25 మాత్రమే మంజూరు చేయడం సరికాదని వెల్లడించారు. ఆ సంఖ్యను పెంచాలని కోరారు. చిన్న వేపంజేరి సర్పంచ్ ఝాన్సీ లక్ష్మీ, పాపిరెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యులు భారతి మాట్లాడుతూ రీ సర్వే పేరుతో గ్రామాలలో గొడవలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సచివాలాయల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని తెలిపారు. ఎంపీపీ అనిత మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు లక్ష్మీ ప్రియ, తహసీల్దార్ చంద్ర శేఖర్, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

డీఈఓను నిలదీసిన తల్లిదండ్రులు

- రసాభాసగా పేరెంట్స్ సమావేశం
- నాడు–నేడు పనుల నిధులేమయ్యామని ఆగ్రహం
- వసతులు లేని పాఠశాలలో ఎందుకు చదివించాలని ప్రశ్న



డీఈఓను ప్రశ్నిస్తున్న విద్యార్థి తండ్రి

విజయపురం: ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్ రసాభాసగా ముగిసింది. ఎంఈఓ హరిప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈఓ వరలక్ష్మికి చేదు అనుభవం ఎదురైంది. పాఠశాల పరిసర ప్రాంతాలను విద్యార్థుల తల్లిదండ్రులు ఆమెకు చూపిస్తూ, మౌలిక వసతులపై ప్రశ్నల వర్షం కురిపించారు. వసతులు లేని పాఠశాలలో తమ పిల్లలను ఎందుకు చదివించాలని, కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా అధికారిగా సమాచారం చెప్పాలని నిలదీశారు. రెండేళ్లకు ముందు మంజూరైన నాడు–నేడు నిధులపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరైన సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక... తాను జిల్లాకి వచ్చి నెలరోజులైందని సమాధానమిచ్చి మెగా పేరెంట్స్ మీట్‌కు హాజరుకాకనే వెళ్లిపోయారు. డీఈఓ వెనుదిరిగిన అనంతరం ఎంఈఓ సమావేశాన్ని కొనసాగించగా, విద్యార్థుల తల్లిదండ్రుల అదే పంథాను కొనసాగిస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్డి, అదనపు పాఠశాల భవనాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రశ్నిస్తున్న విద్యార్థి తండ్రి

ప్రొఫెసర్‌పై దాడి అమానుషం

వడమాలపేట(విజయపురం): దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి అమానుషం, దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జయంతి బాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్వీయూలో ఉన్నత హోదాలో ఉన్న దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై మత ప్రచారం చేశాడని తప్పుడు అభియోగాన్ని మోపి, భౌతికంగా దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

థియేటర్లపై పుష్ప రూల్

నగరి: పట్టణంలో ఇదివరలో ఉన్న రెండు థియేటర్లు ఎస్‌జే, ఎస్‌ఎంసీలలో పుష్ప–2 చిత్రాన్నే ప్రదర్శిస్తుంటే ఇటీవల నవీకరించిన రాజేశ్వరి థియేటర్ కూడా పుష్ప–2 చిత్రంతో మళ్లీ ప్రారంభమైంది. నగరి పట్టణం తమిళనాడు సరిహద్దు కావడంతో రెండు థియేటర్లలో తెలుగులో ప్రదర్శన ఉంటే కొత్తగా ప్రారంభించిన థియేటర్‌లో తమిళంలో పుష్ప–2 చిత్రం ప్రదర్శింపబడుతోంది. మునుపెన్నడూ ఇలా అన్ని థియేటర్లలో ఒకే చిత్రం ప్రదర్శించకపోవడంతో పట్టణంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

టైలర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడికి నివాళి



జయచంద్రన్

నగరి: పట్ట టైలర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, పర్‌ఫెక్ట్ టైలర్‌గా అందరికీ సుపరిచితులైన ఎస్‌ఆర్ జయచంద్రన్ శుక్రవారం రాత్రి మరణించారు. నగరి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, టైలర్స్ అసోసియేషన్ సభ్యులతోపాటు పట్టణ ప్రముఖులు ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

మధ్యవర్తిత్వ చట్టంపై అవగాహన అవసరం





మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర, ఇరుపక్కలా జడ్జిలు విష్ణువర్మ, గోపాలకృష్ణ, సదస్సుకు హాజరైన న్యాయవాదులు

- ఈనెల 14న జాతీయ లోక్‌అదాలత్
- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: న్యాయవాదులు మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక సబ్‌కోర్టులో న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వ్యాజ్యం కంటే మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కారించుకోవడం ద్వారా సంతృప్తికరమైన ఫలితం పొందవచ్చునని వివరించారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించబడిన కేసుల్లో కోర్టు ఫీజులను వాపసు చేస్తామని స్పష్టం చేశారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు ఆందోళన తగ్గి, ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. వైరి వర్గాల మధ్య వ్యాపార, వ్యక్తిగత సంబంధాలు పునరుద్ధరించబడతాయన్నారు. ఈ నెల 14న కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సదస్సులో పుత్తూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, నగరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, న్యాయవాదులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

బంగారుపాళెం: మామిడిలో యాజమాన్య పద్ధతులు, సరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. స్థానిక మామిడి మార్కెట్ యార్డు ఆవరణలో శనివారం మామిడి సాగులో తీసుకోవాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు. మామిడిలో తేనె మంచు, తామర పురుగులు, పండుఈగ, అంత్రాక్నోస్, బూడిద తెగుళ్లు ఆందోళనకు గురిచేస్తాయన్నారు. తేనేమంచు పురుగు నివారణకు బప్రోఫైజిన్ 25 ఈసీ మందు లీటరు నీటికి 1.5 ఎంఎల్ లేదా బప్రోఫైజిన్ 20 ఈసీ, ఎసిఫేట్ 50%డబ్ల్యూపీ మందు 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అంత్రాక్నోస్ నివారణ కోసం థయోఫినేట్ మిథైల్ 70%డబ్ల్యూ మందు గ్రాము లీటరు నీటికి లేదా అజాక్సీస్ట్రోబిన్ 23%ఎస్‌సి మందు 1 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మామిడిలో కవర్లు కట్టడం ద్వారా వచ్చే పంట అధికంగా నాణ్యత కలిగి మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, తిరుపతి నిమ్మ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త రంజిత్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి సాగరిక పాల్గొన్నారు.

ప్రసంగాలకే పరిమితం





డ్రగ్స్ వ్యసనాలకు లోనుకాకూడదంటూ ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు, సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

నగరి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ మీట్ ప్రసంగాలకే పరిమితమైంది. సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వక్తలు ప్రసంగాలు ఇచ్చి వెళ్లడంతో సమావేశం ముగిసింది. మండలంలోని తడుకు పేట, ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్ మీట్ జరిగింది. ఏకాంబరకుప్పంలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి విద్యాభివృద్ధికి ఎన్నో గొప్ప పథకాలు అమలు చేస్తున్నారంటూ పొగడ్తలతో ముంచెత్తారు. ఆర్డీఓ భవానీశంకరి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల చదువుపై శ్రద్ధ చూపితే వారి ఎదుగుదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. తడుకుపేట జిల్లాపరిషత్ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి సీఐ మహేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలపోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో సతీష్, ఎంఈఓలు శ్రీదేవి, నమశ్శివాయం, ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, నమశ్శివాయం, వైస్ ఎంపీపీ కన్నియప్పన్, ఎస్‌ఎంసీ చైర్ పర్సన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా కీళపట్టు రోడ్డు

- నిత్యం భారీ వాహనాల ప్రయాణం
- మరమ్మతులైనా చేపట్టాలంటున్న ప్రయాణికులు



గుంతలమయమైన కీళపట్టు రోడ్డు

నగరి: ఇటీవల కురిసిన వర్షాలకు కుశస్థలి నది కీళపట్టు మార్గంలో లోతట్టు వంతెనపై నుంచి పారడంతో రోడ్డు గుంతలమయంగా మారింది. నగరి పట్టణం నుంచి తమిళనాడుకు వెళ్లే బస్సులు ప్రధానంగా ఈ మార్గంలోనే వెళతాయి. అలాగే మున్సిపాలిటీకి చెందిన కీళపట్టు, నెత్తం కండ్రిగలతోపాటు ఇతర గ్రామాలైన మేళపట్టు, ముడిపల్లి, వీకేఆర్‌పురం, తడుకుపేట గ్రామాలకు నగరి పట్టణం నుంచి వెళ్లేవారు ఈ మార్గంలోనే రాకపోకలు కొనసాగిస్తారు. ఇంతటి కీలకమైన మార్గం కావడంతో నిత్యం భారీవాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తూ ఉంటాయి. ఈ మార్గంలో వర్షాలకు భారీ గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట అలవాటు ప్రకారం యథావిధిగా ఈ మార్గంలో వెళ్లేవారు గుంతల్లో వాహనాలు అదిరి పడడంతో కిందపడి గాయాలపాలవుతున్నారు. రోడ్డు అంచున ఏర్పడిన పెద్ద గుంతలో స్థానికులు ఒక చెట్టు కొమ్మను ఉంచి ఆ వైపు ఎవరూ వెళ్లకుండా ఏర్పాటు చేశారు. అయితే ఇది రాత్రి ప్రయాణం చేసేవారికి కనిపించదు. పొరపాటున వాహనం ఈ గుంత ఉన్నవైపుగా వెళితే ప్రయాణించేవారు ప్రమాదం పాలవ్వక తప్పదు. అధికారులు ఈ ప్రమాదాలను గుర్తించి రోడ్డుకు కనీస మరమ్మతులైనా చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఉన్నత లక్ష్యంతోనే ఉత్తమ భవిత

- ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్–టీచర్స్ మీటింగ్
- అంతంతమాత్రంగానే హాజరైన తల్లిదండ్రులు
- మమ అనిపించిన అధికారులు



కార్వేటినగరం : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ

శ్రీరంగరాజపురం : విద్యార్థులు ఉన్నత లక్ష్యం నిర్దేశించుకుని చదివితే ఉత్తమ భవిష్యత్ పొందవచ్చని ఎమ్మెల్యే థామస్ తెలిపారు. శనివారం మండలంలోని 49కొత్తపల్లెమిట్ట జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పేరెంట్–టీచర్స్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ సమస్యలను వెల్లడించారు. ఎండలో కూర్చుంటున్నామని, కనీసం రేకులైనా ఏర్పాటు చేయాలని కోరారు. బడికి వెళ్లేందుకు సకాలంలో బస్సు రావడం లేదని, ఒకవేళ వచ్చినా ఆపకుండా వెళ్లిపోతున్నారని ఫిర్యాదు చేశారు. ప్రహరీ గోడ సరిగా లేకపోవడంతో బయటి వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి వచ్చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ క్రమంలోనే పారపాళ్యం దళితవాడలో దుండగులు ధ్వంసం చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. నిందితులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎంఈఓ అరుణాచలంరెడ్డి, సబర్మతి, డీఈ సతీష్‌కుమార్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ సుమన్, టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్ నాయుడు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీపీ బండి నాగరాణి తెలిపారు. మండలంలోని జక్కదన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బడి అభివృద్ధి, విద్యార్థుల అభ్యున్నతికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం : మండలంలోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఎంఈఓ విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పిల్లలకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించామన్నారు. అలాగే ఏటా అమ్మ ఒడి పథకం కింద ఆర్థిక సాయం చేశామని వెల్లడించారు. అనంతరం ప్లస్ విద్యార్థులకు ల్యాబ్ ఏర్పాటు కోసం రూ.20 వేలు అందజేశారు. సీడీపీఓ పద్మ సునంద మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యే శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అలాగే ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, పాదిరికుప్పం, కత్తెరపల్లె, కేఎంపురం, గంగమాంబాపురం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సైతం పేరెంట్– టీచర్స్ మీటింగ్ నిర్వహించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన పేరెంట్–టీచర్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు అంతంత మాత్రంగానే హాజరయ్యారు.

జీడీనెల్లూరులో..

గంగాధర నెల్లూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్–టీచర్స్ సమావేశం నిర్వహించారు. డ్వామా పీడీ రవికుమార్, పీఏఎస్‌ఎ వెంకటరమణారెడ్డి, జఎంఈఓ ఆంజనేయులు శెట్టి, గుణ శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.





కార్వేటినగరం : టగ్ ఆఫ్ వార్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో అంతంత మాత్రంగా హాజరైన తల్లిదండ్రులు